విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 14, ఆగస్టు 2025

రైతుల కష్టాన్ని గుర్తించే పార్టీ టీడీపీ

విశాలాంధ్ర -డోన్ : రైతుల కష్టాన్ని గుర్తించిన పార్టీ టీడీపీ అని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ బుధవారం డోన్ నియోజకవర్గంలో వేలాది మంది రైతులు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో భారీ ర్యాలీని నిర్వహించారు. డోన్ పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం దగ్గర నుండి పట్టణ వీధుల గుండా జరిగిన ఈ ర్యాలీలో స్వయంగా ఎడ్ల బండిని తోలుకుంటూ రైతులపాటు ర్యాలీలో ఒక రైతు బాంధవుడుగా డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి రైతులు ఆనందంతో పాల్గొన్నారు. ఆ తర్వాత, మార్కెట్ యార్డ్ వద్ద రైతు సంబర సభలో భాగంగా భారీ బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన దేశానికి ఆహారం అందించే, మన పంట పొలాలను పచ్చగా ఉంచే, ఎండలోనూ వానలోనూ కష్టపడే రైతు, మీ కష్టమే ఈ భూమికి ప్రాణం, మీ చెమటతోనే మన దేశం బతుకుతోంది, అని మన కూటమి ప్రభుత్వం అన్నారు. రైతు కోసం కేవలం మాటలతో కాదు, చేతల్లో చూపించే కృషితో ముందుకు సాగుతోందన్నారు. ఈ పథకం కింద ప్రతి రైతు కుటుంబానికి మొత్తం రూ.20 వేల ఆర్థిక సాయం అందించబడుతుందని, అందులో మొదటి విడతగా రూ.7 వేల మీ బ్యాంకు ఖాతాల్లో జమ అయిందన్నారు. ఇది మీ పంట సాగుకు, వ్యవసాయ అవసరాలకు తోడ్పడటమే కాకుండా, మీ కుటుంబానికి ఆర్థిక భరోసా కలిగిస్తుందన్నారు. మన రైతు చేతిలో డబ్బు ఉంటేనే, గ్రామం పుష్టిగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, నాయకులు లక్ష్మి రెడ్డి,వలసల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యం.. విద్యార్థులకు శాపం

విశాలాంధ్ర - శిరివెళ్ల: వర్షాకాలం వచ్చిందంటే బడిబాట కాస్త బురద మయంగా మారుతోంది. ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేక నానా అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే వారి బాధలు వర్ణనాతీతం. ప్రస్తుత వర్షాలకు బురదతో నిండి గోతుల మయంగా మారింది. ఆ రోడ్డులో నడచి వెళ్లాలంటే విద్యార్థులుసర్కస్ ఫీట్లు తలపిస్తున్న రహదారి కష్టాలు శిరివెళ్ల మండలం రాజనగరం గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. బురద రోడ్డులో అవస్థలు పడుతూ నడుస్తున్న విద్యార్థులు బురదలో జారితే కాలు విరిగినట్టే పాలకుల నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది. పాఠశాలకు నిత్యం వెళ్లేందుకు సరైన రోడ్డు లేక నానా అవస్థలు పడుతున్నారు. బరువుతో కూడిన పుస్తకాల బ్యాగ్‌లు వీపున వేసుకుని అస్త వ్యస్త రోడ్డులో నడవాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకులకు ఉపాధ్యాయులకు గ్రామ పెద్దలకు విద్యార్థులు తమ కష్టాలను ఎన్నో మార్లు మొరపెట్టుకున్న స్పందన కరువైందన్నారు. దీంతో విద్యార్థులకు మట్టి రోడ్డులో, బురదలో నడిచే అవస్థలు తప్పటం లేదు. ఈ నేపథ్యంలో విద్యార్థులు వర్షాకాలం వస్తే స్కూల్‌కు ఎగనామం పెడుతున్నారు. బృందావనం నుండి రాజనగరం రహదారి కలగా మారిందని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. పాలకులు అధికారులు స్పందించి కనీసం గరుకు రోడ్డైనా వేయాలని వాపోతున్నారు.

జన సేవాదళ్ శిక్షణ శిబిరాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - నంద్యాల : వందేళ్ల చరిత్ర కలిగిన సీపీఐ శత వార్షికో త్సవ ఉత్సవాలు జరుపుకుంటున్న సీపీఐ రాష్ట్ర మహా సభలు 23 నుండి 25 వరకు ఒంగోలు పట్టణంలో జరుగుతున్న సందర్భంగా బేతంచెర్ల పట్టణంలో జనసేవాదళ్ శిక్షణ శిబిరము ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ శిక్షణ శిబిరానికి సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని యువకులు శిక్షణ శిబిరాన్ని జయ ప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు బుధ వారం కార్యకర్తల సమావేశంలో తెలిపారు. సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, మండల సహాయ కార్యదర్శులు తాలూకా తిరుమలేష్, దస్తగిరి, పట్టణ కార్యదర్శి నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి ప్రదీప్, సీపీఐ నాయకులు నాగేశ్వర రావు, సోమన్న, శ్రీరాములు, బాలు, మారుతి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: పట్టణంలోని ఆర్ఎస్‌కె భవనంలో ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇంచార్జ్ ఎంపీడీవో భరణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని, ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పిటిసి అన్ని మండల శాఖల అధికారులు హాజరుకానున్నారు. అధికారులు వారి ప్రగతిని వివరించాలన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయం అభివృద్ధికి విరాళం

విశాలాంధ్ర - బనగానపల్లె: మండల పరిధిలోని నందవరం గ్రామంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు కడప జిల్లా దువ్వూరు వాస్తవ్యులు చల్లా మురళీ కృష్ణ ధర్మపత్ని నిర్మల వారి కుమా రుడు చల్లా కార్తీక్ రాజు సతీమణి లిఖిత వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు రూ.25,001లను డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు అందచేశారు.

నీరు నిలిచిన గుంతలు – స్థానికుల అవస్థలు

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్: మేజర్ పంచాయతీ పలుకూరు గ్రామంలో గత కొన్ని రోజు లుగా కురు స్తున్న వర్షాలకు రోడ్లు గుంతలు పడి నీరు నిలిచి గ్రామ ప్రజలు నడవడానికి కూడా ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు. గ్రామపంచాయతీ ఎదురుగా రోడ్డు మీద గుంతలు పడడంతో ఆ దారి నిత్యం రద్దీగా ఉండడంతో అటు విద్యార్థులు ఇటు ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఆ దారిలో ఆసుపత్రికి వెళ్లే గర్భిణీలు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు గ్రామ పంచాయతీకి వెళ్లే ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చవలసినదిగా ప్రజలు కోరుతున్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - నంద్యాల రూరల్: ఎరువుల దుకాణాల యజమానులు ఎరువుల కొరత సృష్టించిన, ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాకుండా రైతులకు ఎరువులు, పురుగుమందులు అధిక ధరలకు విక్రయించిన కఠిన తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి సున్నా వెంకటేశ్వర్లు, సహాయ సంచాలకులు ఆంజనేయ, మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావులు హెచ్చరించారు. బుధవారం నంద్యాల మండలం లోని ఆయా గ్రామాలలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుకాణాల యజమానులు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే ఎఫ్సిఓ 1985 చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ అభివృద్ధి శాఖ మంత్రి ఎన్ఎండి ఫారుక్ చొరవ వల్ల నంద్యాల జిల్లాకు పురుగుమందులు, ఎరువులు కొరత లేదన్నారు. అందువల్ల రైతులు ఆందోళన చెందవద్దని రైతులకు వారు తెలియజేశారు. వీరి వెంట సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించాలి

విశాలాంధ్ర-పాణ్యం: మహిళలకు సురక్షితమైన వాతావరణము కల్పించాలని ఉమెన్స్ ఇన్ డేటా సైన్స్ గూగుల్ డెవలపర్ నిపుణురాలు, చీఫ్ డేటా సైంటిస్ట్ ఉషా రెంగ రాజు పేర్కొన్నారు. బుధవారం ఆర్ జి ఎం ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో ఉమెన్స్ ఇన్ డేటా సైన్స్ సదస్సు ప్రారంభించారు. ఈ సదస్సులో గూగుల్ డెవలపర్ గ్రూప్ మేనేజర్ రాధిక పాల్గొన్నారు. దేశంలో 4వ చాప్టర్‌గా గుర్తింపు పొందిన విడ్స్ క్యాంపస్ అంబాసిడర్ ఆర్జీఎం కళాశాల విద్యార్థిని శైలజ చెర్లోపల్లి ఆధ్వర్యంలో సదస్సు ప్రారంభించారు. ఈ సదస్సులో వక్తలు మాట్లాడుతూ మహిళల సమస్యలు డేటా సైన్స్ ద్వారా ప్రత్యక్షంగా పరిష్కరించగలుగుతామన్న విషయం ఈ కార్యక్రమాల ద్వారా వెల్లడైందని ఆమె పేర్కొన్నారు. మహిళల ప్రాతినిధ్యంలో పెద్ద లోటు ఉందన్నారు. మహిళలకు సురక్షితమైన వాతావరణం, రక్షణ కల్పించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎండీ శివరాం, ప్రిన్సిపల్ డాక్టర్ జయచంద్ర ప్రసాద్, డాక్టర్ భాస్కరరావు, విక్రమ్ చంద్ర పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రాణించాలి

విశాలాంధ్ర - బనగానపల్లె : కరాటే క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజా రెడ్డి సూచించారు. ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో బనగానపల్లె జెన్ స్పోర్ట్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన కరాటే క్రీడాకారులు పాల్గొని గెలుపొందారు. పది మంది కరాటే క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి ఎంపికైన కరాటే క్రీడాకారులు ఎస్.నిహారా, డి.శ్రీదీత్య, టి.దివ్య, ఎ.నాగ సత్విక్, డి.నవదీప్ యాదవ్, ఆర్.బాలాజీ, కె.సాయి చరణ్ తేజ, ఎం.అనిల్ కుమార్, ఎం.చైతన్య రెడ్డి, ఎస్.థమీ మ్ రాజాలను మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి ఘనంగా సత్కరించారు. విద్యార్థి దశలోని ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవడం అవసరమన్నారు.

పంచాయితీ పురోగతిపై శిక్షణ

విశాలాంధ్ర - రుద్రవరం: పంచాయతీ పురోగతి సూచిక పరివర్తనపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో బుధ వారం నిర్వహించారు. శిక్షణా కార్యక్రమానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, అధికారులకు మాస్టర్ ట్రైనర్లు పాములేటి, షాహి నూర్, అరవింద నాయక్, గ్రామ పంచాయతీల నుంచి ఇవ్వవలసిన నివేదికలను అంశాల వారీగా పరిశీలించి వాటిని ఆమోదించే విధానాలను శిక్షణ కార్యక్రమంలో వివరించారు. ఎంపీపీ బాలస్వామి, పర్యవేక్షణ అధికారి సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్, షఫ్రక్ బాబు, జూనియర్ అసిస్టెంట్ హరికిషన్ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, వీఆర్‌పీఈ కమల్ సాహెబ్ పాల్గొన్నారు.

మట్టిలో మెరిసిన మాణిక్యం

- డీఆర్‌డీఓ సైంటిస్టుగా నియామకం
- పట్టుదల కృషితో రాణించిన నిరుపేద యువకుడు
- ప్రభుత్వ విద్యాసంస్థలో చదివి ఉన్నత స్థాయికి ఎదిగిన కొలిమిగుండ్లవాసి
- హర్షం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల కేంద్రమైన కొలిమిగుండ్లకు చెందిన యువకుడు అద్భుత ప్రతిభ కనబరిచి పట్టుదల కృషి ఉంటే సాధించలేనిది లేదని డిఆర్‌డిఓలో సైంటిస్టుగా ఎంపికై నిరూపించాడు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన విద్యకు పేద రికం అడ్డం కాదని నిరూపించి యువతకు ఆదర్శంగా నిలి చాడు. ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ పాఠశాలల్లో చదివి ఆ తర్వాత ఉన్నత విద్యాసంస్థల్లో విద్యను అభ్యసించి కార్పొరేట్ పాఠశాలలకు ప్రభుత్వ బడులు తక్కువ కాదని నిరూపించాడు కలలు కని వాటిని సహకారం చేసుకునే అంతవరకు విశ్రమించని విద్య యువకు డిగా పలువురి చేత ప్రశంసలు అందుకున్నారు. చదు వుల తల్లి సరస్వతి పుత్రుడిగా నిలిచాడు. కొలిమిగుండ్ల పట్టణంలోని ఇరికమాను నాగేశ్వరరావు ఈశ్వ రమ్మ దంపతుల పెద్ద కుమారుడు రామరాజు అద్భుత ప్రతిభతో డిఆర్‌డిఓ సైంటిస్టుగా ఎంపిక కావడ్డాడు. రామరాజు స్థానిక ఎస్సీ స్కూల్ నందు నాలుగో తరగతి వరకు చదివి ఆ తర్వాత సి.బెళగల్ లోని ఏపీ ఎస్ డబ్ల్యూ ఆర్ పాఠశాలలో పదో తరగతి నందు 554 మార్కులు సాధించి అప్పటి కలెక్టర్‌చే ప్రశంస పత్రాలు అందుకున్నారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో గురుకుల విద్యాలయ సంస్థ ఏపీ ఎస్ డబ్ల్యూ ఆర్ కాలేజీలో ఎంపీసీ నందు అత్యధిక మార్కులు పొంది జార్ఖండ్ రాజధాని రాంచీ లోని ప్రతిష్టాత్మకమైన ఎన్ఐటి సీటు సాధించి అప్పటి ముఖ్యమంత్రి రోశయ్యచే రూ.25 వేలు నగదు ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. మెటలర్జీ గ్రూపులో నాలుగు సంవత్సరాలు అక్కడ చదువు పూర్తి చేసుకుని అనంతరం ఐఐఎస్‌సి చదువుతుండగా గేట్ ర్యాంకు పై మధ్యలోనే విశాఖ స్టీల్ ప్లాంట్, ఐటీసీఎల్‌లో ఉద్యోగుల ఆఫర్ రాగా 2017 సంవత్సరంలో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఇంజనీర్‌గామూడేళ్లు సేవలందించి, ప్రమోషన్‌లో భాగంగా ఐటీసీఎల్ నందు అసిస్టెంట్ మేనేజర్‌గా చెన్నైలో నాలుగేళ్లు విధులు నిర్వహించారు. సైంటిస్ట్‌గా దేశ సేవ చేయాలనే ఆశయంతో రామరాజు తల్లిదండ్రులు వివాహం చేసుకోవాలని ఒత్తిడి తీసుకువచ్చినా తిరస్కరించాడు. ఒకవైపు ఉద్యోగం చేస్తూ మరోవైపు తన కలల సహకారం కోసం రాత్రింబవళ్లు చదువుతూ గెట్ ఎగ్జామ్‌లో 71 ర్యాంకు సాధించి ప్రపంచంలోనే పేరుగాంచిన భారతదేశ ఉన్నత సంస్థ జోధాపూర్‌లో ఉన్న డిఆర్‌డిఓ నందు సైంటిస్ట్‌గా ఉద్యోగ బాధ్యతలు ఆగస్టు 13న స్వీకరించాడు. నిరుపేద కుటుంబంలో పుట్టి మట్టిలో మాణిక్యం అయినా రామరాజును మండల ప్రజలు కొనియాడుతు ప్రశంసలు కురిపిస్తున్నారు.

కృత్రిమ సృష్టిస్తున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: కృత్రిమ ఎరువుల కొరత సృష్టిస్తున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సోమన్న డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణ సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, పాణ్యం మండలం రైతు సంఘం కన్వీనర్ కృష్ణ, కోకన్వీనర్ మద్దిలేటిలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ జిల్లాలో 20 లక్షల హెక్టార్లకు పైగా రైతులు పంట భూములను సాగు చేస్తున్నారని, వాటికి అవసరమైన ఎరువులను సరఫరా చేయడంలో అధికారులు విఫలం చెందారని ఆరోపించారు. రైతులు రెండు వారాల నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా సహకార సంఘాలలో పేర్లు నమోదు చేసుకున్నప్పటికీ రైతులకు యూరియా అందడం లేదని, వాటితో పాటు డిఏపి ఇతర కాంప్లెక్స్ ఎరువుల కోసం రైతులు దుకాణాల వద్ద ఎదురు చూస్తున్నారని, నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నా, రైతులకు మాత్రం ఎరువులు అందడం లేదన్నారు. ఎరువుల కొరకు రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతులపై దయవుంచి కృత్రిమ కొరతను సృష్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి భారీ ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీలో డీఎస్పీ

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రజలందరూ ప్రతి ఇంటి వద్ద జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిలో స్ఫూర్తిగా నిలవాలని డీఎస్పీ ప్రమోద్ పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ పట్టణంలో ఆజాదిక అమృత్ సెలబ్రేషన్స్ సందర్భంగా ఆళ్లగడ్డ అవుస్మ నియోజకవర్గ అధ్యక్షులు అమీర్ భాష ఆధ్వర్యంలో కేపీజీ హైస్కూల్ పాఠశాల విద్యార్థులచే బుధవారం నిర్వహించిన ర్యాలీ లో డీఎస్పీ ప్రమోద్, ఆళ్లగడ్డ టౌన్ సిఐ యుగంధర్ పాల్గొన్నారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి జాతీయ జెండాలతో హర్ ఘర్ తిరంగా ప్రతి ఇంట జాతీయ జెండా ఎగరవేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆజాధిక అమృత్ ఉత్సవాలను దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

36వ బ్లాకును మరిచిన అధికారులు

విశాలాంధ్ర - చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు సమీపంలో తెలుగు గంగ 36వ బ్లాకు పంట కాలువకు ఇరువైపులా మెరుసు తోలి ఉంచాల్సిన అధికారులు కేవలం ఒకవైపు మాత్రమే మొరుసుతోలి మరోవైపు మరిచారని పరివాహక రైతులు వాపోతున్నారు. చింతలచెరువు, పెద్దవంగలి, చిన్నవంగలి సమీపంలో 36,37,38బ్లాకు పంట కాలువలు వెలుతున్నాయి. 37,38వ బ్లాకుల పరిధిలో తెలుగు గంగ పంట కాలువలకు ఇరువైపుల మొరుసు రహదారులు ఏర్పాటు చేసిన అధికారులు 36వ బ్లాకు పరిధిలోని కాలువకు ఒకవైపు మాత్రమే ఏర్పాటు చేసి తమకు తీరని అన్యాయం చేస్తున్నారని రైతు విశ్వనాథరెడ్డి ఆరోపించారు. అధికారులు స్పందించి నిబంధనల ప్రకారం ఉండాల్సిన రెండువైపుల మొరుసు రహదారి ఏర్పాటు చేయాలని కోరాడు.

36వ బ్లాకు రైతులకు అన్యాయం జరుగుతుంది - విశ్వనాథరెడ్డి, రైతు: చింతలచెరువు మండలం లోని చింతలచెరువు సమీపంలో 36వ బ్లాకు తెలుగు గంగ పంటకాలువ పరిధిలోని రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. తమ పొలాలకు పంటకాలువ వెంట కేవలం ఒకవైపు మాత్రమే మొరుసు రహదారి ఏర్పాటు చేశారు. రెండోవైపు చేయలేదు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలి.

మండలంలో యూరియా కొరతతో ఇబ్బందులు

విశాలాంధ్ర - పాములపాడు: మండలంలోని పలు గ్రామాల్లో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరి, మొక్కజొన్న వంటి పంటలకు అవసరమైన యూరియా ఎరువు సమయానికి అందకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సహకార సంఘాలు, ఆర్బికెల వద్ద ఎరువుల దుకాణాల వద్దకు రైతులు క్యూలు కడుతున్న సరిపడా లేకపోవడంతో పాములపాడు మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి రైతులు తెలంగాణలోని దగ్గర మండమైన అల్లంపూరు, సైతం వెళ్లి తెచ్చుకుంటున్నామని రైతులు వాపోతున్నారు. మరికొంద రైతులు డోన్, వెల్దుర్తి, కోడుమూరు ప్రాంతాలకు వెళ్లి బంధువుల ద్వారా తెచ్చుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. అలా వెళ్లలేక మండలంలోని కొందరు రైతులు స్థానిక డీలర్ల దగ్గర అధిక ధరలు పెట్టి కొనుగోలు చేస్తున్నట్టు తెలిసింది. రైతుల అవసరాలను ఆసరాగా తీసుకొని కొందరు డీలర్లు బ్లాక్ లో యూరియాను 450 నుండి 500 దాకా విక్రయిస్తున్నారని రైతుల ద్వారా తెలుస్తుంది.

ప్రైవేట్ విద్యాసంస్థలలో ఆర్టీఈ కింద దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-పాణ్యం: ప్రైవేట్ విద్యాసంస్థలలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను ఆర్టిఈ-12(1)సీ ఉచిత విద్యలో భాగంగా ఒకటో తరగతిలో మిగిలిన సీట్లకు మరోసారి దరఖాస్తుల ద్వారా ప్రభుత్వం భర్తీ చేయడం జరుగుతుందని మండల విద్యాధికారి కోటయ్య బుధ వారం తెలిపారు. వారు మాట్లాడుతూ దరఖాస్తులకు ఈ నెల 20వ తేదీన ఆన్లైన్ ద్వారా అప్లయ్ చేసుకోవాలని విద్యార్థుల తల్లి దండ్రులను కోరడం జరుగుతుందన్నారు. ఈ నెల 25న లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేసి, ఈ నెల 31న ఎంపికైన విద్యార్థులకు ప్రైవేట్ విద్యాసంస్థలలో ప్రవేశాలను కల్పించడం జరుగుతుందన్నారు.

పంచాయతీల పురోగతికి అందరు చర్యలు

విశాలాంధ్ర - చాగలమర్రి: ప్రతి గ్రామ పంచాయతీ పురోగతి, సుస్థిరత సాధించేలా ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0, 2023-24 ఆర్థిక ఏడాదికి సంబంధించి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులకు, పంచాయతీ కార్య దర్శులకు, ఒకరోజు శిక్షణ ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా పంచాయతీ సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలు సాధించే దిశగా తొమ్మిది థీమ్ లకు సంబంధించి గ్రామ, మండల స్థాయిలలో అభివృద్ధి ప్రగతికి సంబంధించి ప్రత్యేక అంశాలపై శిక్షణ పూర్తి ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిటీసీలు సర్పంచ్‌లు, డిప్ డిప్యూటీ ఎంపీడీఓ తాహీర్‌హుసేన్, ఏఓ రంగనేతాజీ, ఎంఈఓ అనురాధ, పశు వైద్యాధికారులు సాయిబాబా, దీపాకుమారి, ఈఓ తారకేశ్వరీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, ఏపిఓ ఖాసీం,హెల్త్ అసిస్టెంట్ మనోహర్, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాయితీలు అభివృద్ధి లక్ష్యలను సాధించాలి

విశాలాంధ్ర - వెలుగోడు : సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణకు 9 అంశాలలో గ్రామ పంచాయతీ పనితీరు మరియు పంచాయతీ స్థాయిలో ఫలిత ఆధారిత అభివృద్ధి లక్ష్యాల అంచనా ప్రక్రియను మరింత ముందుకు తీసుకెళ్లాలని తహసీల్దార్ శ్రీనివాస గౌడ్, ఎంపిడిఓ మధుసూదనరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ప్రజా ప్రతినిధులకు, అధికారులకు బుధవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ పురోగతి గ్రామ పంచాయతీ అభివృద్ధి , శుభ్రత, తాగునీరు, ఆరోగ్యం మొదలగు 9 అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీ ల పనితీరు సూచిక వెర్షన్ 1.0నుంచి వెర్షన్ 0.2 పరివర్తన వ్యాప్తి గుర్తించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సురక్షిత నివాసాలు ఎంచుకోండి

విశాలాంధ్ర - శిరివెళ్ల: మట్టి మిద్దెల్లో నివసిస్తున్న ప్రజలు వ్యాపారస్తులు సురక్షిత నివాసాలను ఎంపిక చేసుకోవాలని శిరివెళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ దస్తగిరి బాబు, ఎస్సై చిన్న పీరయ్య యాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పలు మట్టి మిద్దెలను, ఒరిగిన ఇంటి గోడలను పరిశీలించారు. పలువురికి నోటీసులు సైతం జారీచేసి ఎప్పుడు కూలుతుందో ఏ క్షణంలో ఏ విధమైన ప్రమాదం సంభవిస్తుందో చెప్పలేని పరిస్థితి నెలకొని ఉన్నందున మట్టి మిద్దెలలో నివసిస్తున్న వారు ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాల కారణంగా అప్రమత్తం కావాలని తెలిపారు. అధిక వర్షాల కారణంగా మట్టి మిద్దెలు తడిసి బరువెక్కి దంతెలు విరిగి కుప్పకూలే ప్రమాదం ఉండొచ్చన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఈవో అశ్విని కుమార్ ఆధ్వర్యంలో పలు పాత నివాసాల వద్దకు చేరుకొని వర్షాల వల్ల సంభవించే ప్రమాదాలను వివరించి, నిర్లక్ష్యం విడనాడాలని సిఐ, ఎస్ఐ స్పష్టం చేశారు. కంటికి కనిపిస్తున్న ప్రమాదాలు జరగకముందే జాగ్రత్త వహించడం ఉత్తమమని పోలీస్ అధికారులు సూచించారు.

మట్టి వినాయకుడినే పూజించండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: జిల్లాలోని ప్రజలు మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని రక్షించడంలో భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తమ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా కాలుష్య నియంత్రణ మండలి వారి ఆధ్వర్యంలో మట్టి వినాయకుడిని పూజిద్దాం, పర్యావరణాన్ని రక్షిద్దామనే నినాదంతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ జరిగే వినాయక చవితి పండుగను ప్రజలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలన్నారు. పర్యావరణానికి హాని కలగకుండా రసాయనాలతో చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను పూజించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్ రెడ్డి, ఏఈఈ రామకృష్ణ, వారి సిబ్బంది పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జేసీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నంద్యాల పట్టణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. జాతీయ పతాక ఆవిష్కరణ మొదలు కార్యక్రమం ఆద్యంతం వరకు చేస్తున్న ఏర్పాట్లను జెసి పరిశీలించారు. వేదిక బ్యాక్ డ్రాప్, పోలీస్ సాయిద దళాల మార్చ్ ఫాస్ట్‌ను, స్వాతంత్ర సమర యోధుల సన్మానం తదితర ఏర్పాట్లు పగడ్బందీగా ఉండాలని అధికారులకు సూచించారు. డిఆర్డిఏ, డ్వామా వ్యవసాయం, స్త్రీసంక్షేమ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, గిరిజన సంక్షేమం, వైద్య ఆరోగ్యం, ఉద్యానం, సూక్ష్మ సేద్యం సివిల్ సప్లైస్ తదితర శాఖలు ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన చూపరులను ఆకట్టుకునేలా ఉండాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై ఏర్పాటు చేసే ఛాయా చిత్ర ప్రదర్శనలు, అధికారులకు, విఐపిలకు గ్యాలరీల ఏర్పాటు, మంచినీటి వసతి తదితర ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులకు సూచించారు.

ఎలక్షన్ కమిషన్‌పై అనుమానాలున్నాయి



విశాలాంధ్ర -డోన్ : ఎన్నికల కమిషన్‌పై ఎన్నో అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల కమిషన్‌పై ఉందని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు అన్నారు. బుధవారం ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎన్నికల కమిషన్‌కు ఎన్నికల అవకతవకలపై 5 ప్రశ్నలలు అడిగితే సమాధానం చెప్పడం లేదన్నారు. ప్రధాని మోడీ ఓటును నమ్ముకోకుండా ఈసినే నమ్ముకొని పదవి పొందుతున్నాడని ఆరోపంచారు. రాహుల్ గాంధీ ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా పోగా, బీజేపీ నేతలు రాహుల్ గాంధీపై విమర్శలు చేయడం సరికాదన్నారు. రాహుల్ గాంధీకి ప్రాణహాని ఉందని, ఆయన రక్షణ కల్పించాలని, ఆయనకు సీపీఐ పార్టీ మద్దతుగా ఉంటుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, కానీ మోడీ ఈవియం లను నమ్ముకొని 11 సంవత్సరాలనుండి పీఎంగా కొనసాగుతు న్నాడన్నారు. గత ఎన్నికల్లో జగన్ సీఎం కావడానికి, ప్రస్తుతం చంద్రబాబు సీఎం కావడానికి మోడీ టాంపరింగేనని అనుమానం వ్యక్తం అవుతోందన్నారు. ఎన్నికల కమిషన్ నిశపక్షపాతంగా వ్యవహరించిన అనుమానలను తెలియజేయాలన్నారు. లేనియెడల ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అధిక వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - శిరివెళ్ల : ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ విజయశ్రీ పిలుపునిచ్చారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ నేడు ఎల్లో అలర్టులను వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో వర్షాలను ఎదుర్కొనేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధిక వర్షాల వల్ల ప్రమాదాలు జరగకుండా గ్రామ రెవెన్యూ అధికారులు, వీఆర్ఏలు అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు ప్రజలకు సూచించాలని తహసిల్దార్ ఆదేశించారు. మండల పరిధిలోని ఖాదరబాదర, శిరివెళ్ల, చెన్నూరు, ఇసుకపల్లె, మహాదేవపురం, గుండంపాడు తదితర గ్రామాలలో ఉన్న వక్కిలేరు వాగుల వద్దకు మహిళలు చిన్నారులు ప్రజలు రుద్దులు వెళ్లకుండా అవగాహన కల్పించాలని సూచించారు. బోయల కుంట్ల, గంగవరం చెన్నూరు శిరివెళ్ల తదితర గ్రామాలలోని చెరువులు నిండి ఉన్నాయని వాటి సమీపంలోకి వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు వెళ్లకుండా తగిన జాగ్రత్త వహించాలన్నారు. వాగులు, తెలుగు గంగ, కేసీ కెనాల్ కాలువలు పొంగి పొర్లుతున్నందున నీటి ప్రమాదాలు తలెత్తే అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని. పురాతన నివాసాలు, మట్టి మిద్దెలు, ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా కూలిపోయే ప్రమాదం ఉంటే సురక్షిత నివాస ప్రాంతాలకు తరలి వెళ్లేలా ప్రోత్సహించాలని తహసీల్దార్ ఆదేశించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: వరల్డ్ లార్జెస్ట్ గ్రైన్ స్టోరేజ్ ప్లాన్ కింద ప్రతి మండలంలో కోల్డ్ స్టోరేజ్ యూనిట్ ఏర్పాటుకు రెండెకరాల ప్రభుత్వ భూమిని గుర్తించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ డెవలప్మెంట్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూమిని గుర్తించే అంశంలో తహసీల్దార్లతో కోఆర్డినేట్ చేసుకోవాలని జిల్లా సహకార శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఉన్న పిఏసి కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పీఎం జన ఔషధీ కేంద్రాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సహకార శాఖ అధికారులను ఆదేశించారు. పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ లతో కో ఆర్డినేట్ చేసుకొని ప్రజలకు జన ఔషధీ కేంద్రాలలో తక్కువ ధరకు మందులు అందుబాటులో ఉంటాయని తెలిసే విధంగా చూడాలన్నారు. డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చే ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జన ఔషధీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు హాస్పిటల్ సూపరింటెండెంట్‌తో మాట్లాడాలని కలెక్టర్ జిల్లా కో ఆపరేటివ్ అధికారిని ఆదేశించారు. పిఏసి కేంద్రాల్లో యూరియా విక్రయాలపై తనిఖీ చేయాలని కలెక్టర్ జిల్లా సహకార శాఖ అధికారిని ఆదేశించారు. డైవర్షన్ జరిగిందా, లేదంటే ఎక్కువ మోతాదులో ఎవరికైనా అమ్మినారా, అనే విషయాలను వెరిఫై చేసి, నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా ఖచ్చితంగా అందుబాటులో ఉండాలని కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. ఫేజ్1లో శాంక్షన్ అయిన మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్ గో డౌన్‌ల నిర్మాణాలు 25 శాతం కంటే తక్కువ నిర్మాణం జరిగిన గోడౌన్‌లు 16 ఉన్నాయన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, జిల్లా కోఆపరేటివ్ అధికారి వెంకట కృష్ణ, డిసిసిబి సీఈఓ రామాంజనేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, డిఆర్‌డిఏ పిడి రమణా రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు వేదిక కానున్న ఒంగోలు : బి.గిడ్డయ్య

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం భవిష్యత్తులో జరిగే పోరాటాలకు ఒంగోలు నగరం వేదిక కానున్నదని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తెలిపారు. బుధవారం నాడు స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ నందు సీపీఐ 28వ రాష్ట్ర మహాసభల పోస్టర్స్ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ మునెప్ప, ఎన్.లెనిన్ బాబు జిల్లా కార్యవర్గ సభ్యులు కె.జగన్నాథం, పి.రామకృష్ణారెడ్డి, జి.చంద్రశేఖర్ కె.శ్రీనివాసులు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిడ్డయ్య మాట్లాడుతూ 28వ రాష్ట్ర మహాసభలు ఈనెల 20 నుండి 25వ తేదీ వరకు ఒంగోలు పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 23వ తేదీన వేలాది మందితో ప్రదర్శన బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని, ఈ బహిరంగ సభకు సభాధ్యక్షులు కె.రామకృష్ణ, ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కె.నారాయణ, తెలంగాణ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ళ నాగేశ్వర రావు, జేవీ సత్యనారాయణమూర్తి, కార్యవర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కావాలంటే రాష్ట్రంలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు, నూతన పరిశ్రమలు, రాయలసీమ ఉత్త రాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ, రైతాంగ కార్మిక మహిళ సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమాలకు రూపకల్పన చేస్తామన్నారు. కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తూ ప్రైవేటీకరణ ప్రోత్సహించడం, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ కూడా ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా వైఫల్యం చెందుతుందని విమర్శించారు. ముఖ్యమంత్రి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టులపై ఉన్న శ్రద్ధ వెనుక ఉన్న ప్రాంతాల అభివృద్ధికి ఎందుకు చొరవ చూపడం లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం కర్నూలు జిల్లా అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం చేయడం జిల్లా ప్రజలు మోసం చేయడమనే రాష్ట్ర మహాసభల అనంతరం కర్నూలు జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు పరిశ్రమల స్థాపన కోసం ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు వి.నాగరాజు, సి.మహేష్, ఇ.శ్రీరాములు, సోమన్న, షాబీర్ బాష, భద్ర కుమార్, అన్వర్ పాల్గొన్నారు.

జీడీపీని పరిశీలించిన సబ్ కలెక్టర్

విశాలాంధ్ర - గోనె గండ్ల : గాజులదిన్నె ప్రాజెక్టును ఆదోని సబ్ కలెక్టర్ బుధ వారం సందర్శించి సమగ్రంగా తనిఖీ చేశారు. ప్రాజెక్టు గేట్ల పనితీరు, నీటి మట్టం స్థాయి, నిల్వ సామర్థ్యం, ప్రవాహ నియంత్రణ వ్యవస్థ, భద్రతా పనితీరు పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత ఇరిగేషన్ శాఖాధికారుల నుండి ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, గేట్ల, మరియు వివిధ మరమ్మత్తులు, ప్రస్తుతం వర్షాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్ర త్తలు, అత్యవసర ప్రణాళికలపై పూర్తి నివేదిక తీసుకున్నారు. ప్రాజెక్టు వద్ద భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించడంతో పాటు, పక్క గ్రామాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రాజెక్టు పరిసరాల్లో శుభ్రత, పర్యావరణ సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైతే వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టాలని ఆయన సూచించారు. వరద నియంత్రణ చర్యలలో ఎలాంటి నిర్లక్ష్యం జరగ కూడదని అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. తహశీల్దార్ రాజేశ్వరి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : రక్తదానం ప్రాణ దానంతో సమానమని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.శ్రీహర్ష అన్నారు. బుధవారం కేవియస్ కార్యాలయ ఆవరణలో తలసేమియా వ్యాధిగ్రస్తులకు నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో రెండో పట్టణ సిఐ జి.నాగరాజు రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తలసేమియా వ్యాధిగ్రస్తులకు, ఆపద ఉన్న వారికి సహాయం చేయడం మానవత్వ ధర్మమని, అపోహలు వీడి యువత రక్తదానం చేయడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. సామాజిక సేవ కార్యక్రమాల్లో యువత ఎప్పుడూ ముందుండాలని, కేవీఎస్ సేవ కార్యక్రమాలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కేవియస్ సభ్యులు హరినాథ్ గౌడ్, సీఎస్ శ్రీనివాసులు, మధు, రాఘవేంద్ర, నాగరాజు, భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న అశోకా ఉమెన్స్ కాలేజ్ చైర్మన్ అశోక్ వర్ధన్ రెడ్డి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: పెద్ద టేకూరు వద్ద మంగళ వారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పెళ్లి వారి ట్రాక్టర్‌ని లారీ ఢీకొనడంతో పెళ్లి బృందం వారు సుమారు 10మందికి పైగా తీవ్రగాయాలై రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డారు. అదే సమయంలో చిన్నటేకూర్‌లో ఉన్న క్యాంపస్ నుండి బయలుదేరి కర్నూల్ వైపుగా వెళ్తున్న అశోకా కాలేజ్ చైర్మన్ అశోక్ వర్ధన్ రెడ్డి తీవ్ర రక్తస్రా వమై విలవిల్లాడుతున్న 5గురు పెళ్లి వారిని తన వాహనంలో ఎక్కించు కొని ప్రభుత్వ హాస్పిటల్ క్యాజువాలిటీ వార్డ్‌నకు తరలించి మానవత్వం చాటుకున్నారు. పెళ్లి బృందం వారంతా చిన్నటేకూరు గ్రామానికి చెందిన వారుగా గుర్తించారు. ఆలస్యం చేయకుండా హస్పటల్‌కి తరలించడంతో వారు ప్రాణాపాయం తప్పి కోలుకుంటున్నారని గ్రామస్తులు తెలిపారు.

యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర - నంద వరం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు రైతులకు అవసరమై నంత యూరియాను సరఫరా చేయడంలో అధికారులు, కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, సిపిఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, రైతు సంఘం తాలూకా కార్యదర్శి శాంతన్న విమర్శించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మండల వారీగా సొసైటీలోను, ఆర్బికేలోను రైతులు గుంపులు గుంపులుగా, పడిగాపులుగా ఉండి ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం యూరియా కృత్రిమ కొరతను నివారించి, రైతులను ఆదుకోవాలని, రైతులందరికీ ప్రభుత్వం నిర్ణయిం చిన ధరలకే యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వారి గోడౌన్‌లో నుండి యూరియాను అమ్ముకోవడం జరుగుతుందని, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, ఫర్టిలైజర్ షాపులను పర్యవేక్షించడం లేదని, యూరియాను బ్లాక్ మార్కెట్ చేస్తున్న వ్యాపారులను అరికట్టి వారి పైన క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

మెరుగైన పారిశుద్ధ్యానికి వార్డు స్థాయి ప్రణాళికలు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : నగరంలో మెరుగైన పారిశుద్ధ్య పనుల నిర్వహణకు వార్డు స్థాయిలో ప్రణాళికలు రూపొందించుకొని, సంబంధింత అధికారులు సమన్వయంతో అమలు చేయాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. బుధవారం పారిశుద్ధ్య, ఇంజనీరింగ్, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షన్ రాష్ట్ర నోడల్ అధికారి ఉదయ్ సింగ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వందశాతం ఇంటింటి చెత్తా సేకరణ, పకడ్బందీగా పూడికతీత పనులు, ప్లాస్టిక్ వాడకం నిషేధం, చెత్తకుప్పల తొలగింపు కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వొకేషనల్ కళాశాలలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక బి.క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యస్ నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో బుధవారం నాడు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఇంటర్మీడియట్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సి.సురేష్ బాబు, కర్నూలు రీజనల్ ఇన్స్పెక్షన్ ఆఫీసర్ జి.లాలప్ప, సెట్కూర్ సీఈఓ డాక్టర్ వేణు గోపాల్, డీఎస్‌పి మహబూబ్ బాష, సామాజిక వేత్త రాయపాటి శ్రీనివాస్ జాతీయ జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. వొకేషనల్ జూనియర్ కళాశాల నుండి సి.క్యాంప్, బిర్లా సర్కిల్ మీదుగా కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీలో ఆలపించిన దేశభక్తి గీతాలు, నినాదాలు పురప్రజలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్ ప్రసన్న కుమార్, రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, జబీన్ అక్తర్, సోమేష్ లక్ష్మి, గిరిజారాణి, ఉల్గోజి రావు, చిన్న మల్లేశ్వరుడు విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

విశాలాంధ్ర - ఆస్పరి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు చేపట్టిందని ఇందులో సర్పంచుల పాత్ర కీలకమని ఎంపీడీవో గీతవాణి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి-2లో భాగంగా పంచాయతీల నిధులు, విధులు వినియోగం, పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపనకు సర్పంచ్‌లు పాటుపడాలన్నారు. గ్రామాలు అభివృద్ధికి ప్రభుత్వం అందించే నిధులను సర్పంచ్‌లు సద్వినియోగంచేసుకోవాలని, పంచాయతీ నిధులు, వాటి వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర ఉమాదేవి, తాసిల్దార్ రామేశ్వర్ రెడ్డి, ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్ బాలకృష్ణారెడ్డి, ఐసిడిఎస్, వెలుగు అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శిలు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులుగా బి.రాజు ఎన్నిక

విశాలాంధ్ర - కోడుమూరు: సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులుగా బి.రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు కర్నూలు నగరంలో సీపీఐ జిల్లా 24వ మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ మహాసభలలో కోడుమూరు మండల సీపీఐ కార్యదర్శిగా ఉన్న బి.రాజును పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మహాసభల్లో భాగంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి గిడ్డయ్యల సమక్షంలో ఈ ఎన్నిక ఏకగ్రీవమైంది. జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ పార్టీ పిలుపు మేరకు ఉద్యమాలు తదితర కార్యక్రమాలన్నింటినీ విజయవంతంగా నిర్వహిస్తానన్నారు. తనపై పెట్టిన పెద్ద బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, పార్టీ పురోభివృద్ధికి కృషి చేయనున్నట్లు అన్నారు. ప్రజాసంఘాల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు.జిల్లా కార్యవర్గ సభ్యుడిగా తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర పార్టీ నాయకత్వానికి, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య తదితర పార్టీ నాయకులకు రాజు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇదిలా ఉండగా జిల్లా కార్యవర్గ సభ్యులుగా రాజు ఎన్నిక పట్ల ఎమ్మార్పీఎస్, ఏఐటియుసి, ఆటో వర్కర్స్ యూనియన్, హమాలీ కార్మిక సంఘం, తదితర ప్రజాసంఘాల నాయకులు అభినందనలు తెలిపారు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి సూచనలు మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్, బ్యాంక్, పంచాయతీ, సచివాలయం, భూసేకరణ ఇతర సంబంధిత అధికారులతో వచ్చే నెల సెప్టెంబర్ 13 జరుగ బోయే జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో కోర్టులలో పెండింగ్ ఉన్న సివిల్ కేసులు, భూ సేకరణ కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌ను సెప్టెంబర్ 13వ తేదిన నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో ఎక్కువ కేసులు పరిష్కరించేల ప్రత్యేక దృష్టి సారించి, ఈలోక్ అదాలత్‌ను విజయవంతం అయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ అవకాశమును కక్షిదారులు వినియోగించుకోని వారి కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించు కోవాలని కోరారు.

గ్రామాల అభివృద్ధికై నివేదికలు సిద్ధం చేయాలి

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: గ్రామాల అభివృద్ధి కొరకై నివేదికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో మోహన్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కృష్ణగిరి ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గ్రామానికి వచ్చే నిధులను గ్రామ అభివృద్ధికి ఖర్చు పెట్టాలని సదుద్దేశంతో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలో డ్రైనేజీ, వీధిలైట్లు, సీసీ రోడ్లు, త్రాగునీరు గ్రామపంచాయతీ వనరులు తదితర వాటిపై నివేదికలు సిద్ధపరచాలని ఆయన తెలిపారు. గ్రామపంచాయతీ చట్టం ప్రకారంగా గ్రామ పంచాయతీకి వచ్చే నిధులను గ్రామ అభివృద్ధికి ఖర్చు పెట్టాలని ఆయన తెలిపారు. గ్రామపంచాయతీ అభివృద్ధిలో భాగంగా గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి ముఖ్య పాత్ర పోషించాలని ఆయన సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు సౌకర్యవంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్ ఇన్స్పెక్టర్ మనోహర్, సూపర్డెంట్ రామస్వామి, వైద్య సిబ్బంది గజేంద్ర రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు లచ్చప్ప, అనుష, మస్తాన్ భాష, వెంకటేశ్వర్లు, కరిమునిసా, హరికృష్ణ పాల్గొన్నారు.

చౌకధరల దుకాణంలో రేషన్ పంపిణీపై ఆరా

విశాలాంధ్ర- గోనెగండ్ల: మండల కేంద్రంలోని చౌక ధరల దుకాణం నంబర్ 35ను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ కలెక్టర్ దుకాణంలో రేషన్ కార్డు సభ్యుల సంఖ్య, ఇప్పటివరకు సరుకులు పంపిణీ చేసిన వారి వివరాలు, ఇంకా ఎన్ని కుటుంబాలకు పంపిణీ చేయాల్సి ఉందనే అంశాలపై సంబంధిత అధికారుల నుంచి సమగ్రంగా వివరాలు సేకరించారు. ప్రత్యేకంగా 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ డోర్ డెలివరీ ఎంత శాతం పూర్తి చేశారనే విషయాలపై ఆరా తీశారు. రేషన్ పంపిణీ పారదర్శకంగా, ఎలాంటి లోపాలు లేకుండా జరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలోకి చేరిన వర్షపు నీరు

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని మడ్డి లింగాలహల్లి అంగన్వాడీ కేంద్రంలో బుధవారం వర్షం నీరు దూరడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. పురాతన భవనం కావడంతో శిథిలావస్థకు చేరిందని, భవనం ఎప్పుడు కూలుతుందో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొనిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రంలో వర్షం నీరు దూరడంతో పాములు, తేళ్లు, కప్పలు చేరాయని విషపురుగులు విద్యార్థులకు కాటేస్తే ఎవరు బాధ్యత వహిస్తారని విద్యార్థుల తల్లిదండ్రు లు అన్నారు. అంగన్వాడి కేంద్రంలో వర్షం నీరు దూరడం వల్ల భవనమంత కలుషితంగమారి విద్యార్థులకు అంటు రోగాలు వస్తాయని చిన్నపిల్లలకు రోగాలు వస్తే ఎక్కడికి వెళ్లి వైద్య చికిత్స చేయించుకోవాలని విద్యార్థుల తల్లులు స్పష్టం చేశారు. భవనం నిర్మించాలంటూ ఎన్నోసార్లు అధికారులు చెప్పిన ఎవ్వరు పట్టించుకోలేదని, జిల్లా ఉన్నత అధికారులు చర్యలు తీసుకొని నూతన అంగన్వాడి భవన నిర్మాణానికి శ్రద్ధ వహించాలని సర్పంచ్ జీకే సుధాకర్ విజ్ఞప్తి చేశారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అంగన్వాడీ కేంద్రానికి విద్యార్థులు రావడానికి జంకుతున్నారని అన్నారు.

రైతుల సమక్షంలోనే రీ సర్వే నిర్వహించాలి

విశాలాంధ్ర - నందవరం: రైతుల సమక్షంలోనే గ్రామాల్లో రైతుల సమక్షంలోనే బోధి సర్వే నిర్వహించాలని జిల్లా సర్వేయర్ ముని కన్నన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముగతిలో రీసర్వేను పరిశీలించి, త్వరలో ప్రారంభం కానున్న హాలహర్వి భూ సర్వే బౌండరీలు గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూరీ సర్వే చేసే పొలాల్లో ప్రతి రైతు హాజరయ్యే విధంగా చూసిన తర్వాతే సర్వే నిర్వహించాలని, రైతుల అభ్యంతరం దృష్టిలో ఉంచుకొని, వాటిని త్వరగా పరిష్కరించాలన్నారు. రైతుల అనుమానాలను నివృత్తి చేసిన తర్వాతే సర్వే పూర్తి చేయాలన్నారు. డివిజన్ సర్వేయర్ శ్రీనివాస రాజు, మండల సర్వేయర్ అక్బర్ బాష, గ్రామ సర్వేయర్లు ముగతి శేఖర్, ఉరుకుంద పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా బైక్ ర్యాలీలో ఎంపీ

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: హర్ ఘర్ తిరంగాలో భాగంగా యువ జన సంక్షేమ శాఖ సెట్కూరు ఆధ్వర్యంలో కర్నూలు నగరంలో బైక్ ర్యాలీని నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి మెడికల్ కళాశాల, రాజ్ విహార్ సర్కిల్, కిడ్స్ వరల్డ్ మీదుగా పాత బస్టాండ్ లోని కొండారెడ్డి బురుజు వరకు సాగిన బైక్ ర్యాలీలని ఎంపీ బస్తిపాటి నాగరాజు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ స్వాతంత్ర దినోత్స వాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరు తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఎగుర వేయాలని పిలుపునిచ్చారు. త్రివర్ణ పతాకం తమ ఇళ్ల పై ఎగుర వేయటం ద్వారా ప్రతిఒక్కరిలో జాతీయభావం పెంపొందు తుందన్నారు. జాయింట్ కలెక్టర్ నవ్య, డీఈఓ శ్యామ్యూల్ పాల్, మున్సిపల్ కమీషనర్ విశ్వనాథ్, సెట్కూరు సీఈఓ వేణు గోపాల్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : గత వారం హైదరాబాద్‌లో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన జాలవాడి గ్రామానికి చెందిన కురువ జంపాపురం ఆంజనేయ మృతి చెందారు. దీంతో వైసీపీ నాయకులు బోయ కంబగిరి గోపాల్ మృతుని భార్య లక్ష్మికి రూ.6 వేలు ఆర్థిక సహాయం చేసి చేయూత ఇచ్చి కుటుంబాన్ని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రకోట మల్లమ్మ, ఎంపీటీసీ కురువ వెంకటేష్, వైస్ సర్పంచ్ ఉసేని, నాయకులు రామాంజి, బోయ బాబు, వడ్డే బాబు, బ్రహ్మ, హనుమేష్, నర్సింహులు, హరి, చాకలి నల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు

విశాలాంధ్ర - ఆదోని రూరల్: ఎడతెరిపి లేకుండా వారం రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలను బుధవారం పట్టణంలోని కల్లుబావి, వాల్మీకి నగర్, మాలపుర వీధిలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ టిడిపి ఇంచార్జ్ గుడిసె ఆది కృష్ణమ్మ పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ఇండ్లలోకి మురుగునీరు చేరి ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను ఆమె తన అనుచరులతో కలిసి పర్యటించి బాధితులతో మాట్లాడారు. కల్లుబావిలో పెద్ద డ్రైనేజీ వంక పక్కన నివసిస్తున్న ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆది కృష్ణమ్మ మాట్లాడుతూ ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వర్షపు నీరు ఇళ్లలోకి రాకుండా రోడ్లు, డ్రైనేజీలు, నీటి కుళాయిల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని భరోసా ఇచ్చారు. పర్యటనలో మాజీ ఎంపీపీ మురళి, మాజీ జెడ్పిటిసి సభ్యులు రామ్ భీమ్ నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు మల్లి, సిద్ధ, లక్ష్మన్న, జయ రాం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని చిన్న హ్యాట కన్నడ ఎంపియుపి పాఠశాలలో మంగళవారం ఉషోదయ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వ్యవస్థాపకులు సిహెచ్ నాగరాజ్ 200 మంది విద్యార్థులకు భోజనాల ప్లేట్లను అందించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి శ్రీ బాలాజీ పెట్రో లియం యజమాని సీహెచ్ శేషగిరి, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగ నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీ బాలాజీ పెట్రోలియం యజమాని సిహెచ్ శేషగిరి మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలకు ఇదోదిక సాయం చేసిన ఉషోదయ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వ్యవస్థాపకులు సిహెచ్ నాగరాజును అభినందిం చారు. సొంత ఊరిలో యువకులుచదువుకొని ఎన్నో రంగాల్లో ఎది గారని కొనియాడారు. విద్యాభివృద్ధితో పాటు, పాఠశాల అభివృద్ధికి తనవంతు సహాయం ఎల్లప్పుడూ చేస్తానని పాఠశాల అభివృద్ధితోపాటు ఏ ఇతర సమస్యలు తీసుకొచ్చిన పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నా మని స్పష్టం చేశారు. విద్యార్థులకు చక్కటి ప్రణాళికలతో విద్యా బోధన కల్పించడానికి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్లు మారెప్ప, పాండురంగ, ఉపాధ్యాయులు బిటి కలందర్, నాగవేణి, ఎస్ఎంసి చైర్మన్ నీలకంఠ, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షాలు వస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: జిల్లాలో అధికంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం సబ్ కలెక్టర్ ఆర్డీవోలు తహశీల్దార్లు, ఎంపిడిఓలు, ఇరిగేషన్ అధికారులతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత రెండు మూడు రోజులుగా అధిక వర్షపాతం నమోదయిందన్నారు. జూన్ జూలైలో సాధారణ వర్షపాతం నమోదు కాగా, ఆగస్టులో ఇప్పటివరకు 146.5 మి.మీ.తో 27.8శాతం అధిక వర్షపాతం నమోదయిందన్నారు. కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్, కల్లూరు, చిప్పగిరి, హాళహర్వి, ఆలూరు, మద్దికెర, నందవరం మండలాలలో అధిక వర్షపాతం నమోదయిందన్నారు. వచ్చే రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్లు, చెరువులు, లోతట్టు ప్రాంతాలు, పాత బ్రిడ్జి లు పరిశీలించాలని కలెక్టర్ సబ్ కలెక్టర్, తహసీల్దార్లు, ఇరిగేషన్ అధికారులు, ఆర్ అండ్ బీ అధికారులు, ఎంపిడిఓ లను ఆదేశించారు. అవసరమైన చోట ప్రమాదాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సుంకేసుల, గాజుల దిన్నె, వందికోన రిజర్వాయర్లను పరిశీలించాలని సబ్ కలెక్టర్,ఆర్డీవోల ను ఆదేశించారు.

అన్నదాత సుఖీభవ పథకం అమలుతో రైతులు ఆనందోత్సవాలు

విశాలాంధ్ర - సి.బెళగల్ : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని రైతులు 200 ట్రాక్టర్లతో భారీ కృతజ్ఞత ర్యాలీ నిర్వహించారు. బుధ వారం మండల కేంద్రం నందు భారీ ఎత్తున కృతజ్ఞత ర్యాలీ నిర్వహించడంతో పండుగ వాతా వరణం నెలకొంది. ఈ ర్యాలీలో జిల్లాకేడీసీసీ చైర్మన్ డి.విష్ణు వర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరితో కలిసి ట్రాక్టర్లు నడిపి రైతులలో నూతన ఉత్సాహాన్ని నింపారు. ఈ ట్రాక్టర్ ర్యాలీ అనంతరం బస్టాండ్ ఆవరణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం వారు మాట్లాడుతూఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టి, సంవత్సరానికి రూ.20 వేలు ప్రతి రైతుకు ఇస్తామన్న సందర్భంగా ఈనాడు రైతుల ఖాతాల్లో అన్నదాత, సుఖీభవ పథకం ద్వారా మొదటి విడతగా రూ.7వేలు జమ చేయడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కూటమి ప్రభుత్వానికి రైతులు కృతజ్ఞతలు తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించడం ఆనందంగా ఉందని విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కేడీసీసీబీ చైర్మన్ డి.విష్ణు వర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం రైతుల ఖాతాల్లోకి అన్నదాత సుఖీభవ నిధులు జమ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లెల్సీడీసీ సభ్యులు గుడిపాటి మహేశ్వర్ రెడ్డి, మండల కన్వీనర్లు, మండగిరి చంద్రశేఖర్, బ్రిర వెంకటేష్, రామకృష్ణ రెడ్డి, సురేష్, మండల సింగల్ విండో చైర్మన్ చిన్న తిమ్మప్ప, పార్టీ నాయకులు, ఎంపీటీసీ ఈరన్న గౌడ్ పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు అధికారులు కృషి చేయాలి

విశాలాంధ్ర - నందవరం: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ పుల్లయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. బుధ వారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచిక 2.0 ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదరికం నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 17 లక్ష్యాలను ఏర్పాటు చేసి, 9 థీమ్స్‌గా ప్రజల్లోకి అధికారులు వెళ్లాలన్నారు. వాటిలో పేదరికం లేని పంచాయితీ, హెల్త్ పంచాయితీ, చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయితీ, వాటర్ సఫిసియంట్ పంచాయతీ, పరిశుభ్రమైన పచ్చదానమైన పంచాయతీ, స్వయం సమృద్ధమైన పంచాయితీ, సామాజిక భద్రత గల పంచాయితీ, ప్రజలకు మంచి పరిపాలన పంచాయితీ, స్త్రీలకు అనుకూలమైన పంచాయతీలుగా విభజించి, ఆయా శాఖలకు సంబంధించిన ప్రతి అధికారి గ్రామాల్లో పర్యటిస్తూ, ఎప్పటికప్పుడు గ్రామాల్లోని సమస్యలను పరిష్కరిస్తూ, ప్రజల అభివృద్ధికి అనుకూలమైన పంచాయతీగా తీర్చిదిద్దడంలో ఒకరికి ఒకరు సహాయ సహకారాలు అందించుకోవాలన్నారు. లక్ష్యాలను ఎప్పటికప్పుడు సాధిస్తూ ఉన్నతాధికారులకు నివేదికలు పంపాలని, నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి నిఖిల్ చక్రవర్తి, ఎంఇఓ రఘునాథ్, పిఆర్, ఆర్డబ్ల్యూఎస్ ఎఇలు నరసింహులు, బాలకృష్ణ పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల

www.visalaandra.com

కర్నూలు, గురువారం 14, ఆగస్టు 2025

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించండి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: అనధికార లేఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని అర్హులైన వారు వినియోగించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య సూచించారు. బుధవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో ఎల్ఆర్‌యస్ పథకంపై లైసెన్స్ ఇంజనీర్లతో జేసి, నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకంలో కొన్ని సవరణలు చేస్తూ ప్రభుత్వం జీఓ 134 జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ 30కి ముందు ఏర్పాటైన అనధికార లేఔట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందన్నారు. ఇందుకు అక్టోబర్ 24వ తేదీలోపు రూ.10 వేలు చెల్లించి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది తనిఖీ చేసి ధ్రువీకరించిన తర్వాత మార్కెట్ విలువలో 14 శాతం అపరాధ రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకో వచ్చన్నారు. 45 రోజు ల్లోపు పూర్తి రుసుం చెల్లించిన వారికి 10 శాతం రాయితీ, 45 నుంచి 90 రోజుల వ్యవధిలో చెల్లిం చిన వారికి 5 శాతం రాయితీ ఉంటుందన్నారు. గడువులోపు క్రమబద్ధీకరించుకోని అనధికార లేఔట్లు, ప్లాట్లకు విద్యుత్ సౌకర్యం, నీటి సరఫరా, డ్రైనేజీ వంటి సదుపాయాలకు అనుమతి ఉండదని వెల్లడించారు. ఈ పథకాన్ని యజమానులు, రియల్టర్లు వినియోగించుకునేలా లైసెన్స్ ఇంజనీర్లు చొరవ చూపాలని జేసీ సూచించారు. ఆర్‌డిటిటిపి సంజీవ్ కుమార్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అంజాద్ బాష, తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనం సక్రమంగా జరిగేలా చూడాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : సెప్టెంబర్ 4వ తేదీన నిర్వహించనున్న వినాయక నిమజ్జనం ఉత్సవం సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 4వ తేదీన వినాయక నిమజ్జన ఉత్సవం సందర్భంగా ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో బుధవారం జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనం ఉత్సవ నిర్వహణకు సంబంధించి ఆయా శాఖలకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. శాంతి భద్రతలకు సంబంధించి ఎలాంటి సమస్యలు రాకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జనానికి ముందు రోజు నుండి మద్యం అమ్మకాలు జరగకుండా డ్రై డే పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. బారికేడింగ్ ఏర్పాట్లు చేయాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. కెసి కెనాలలో నీటి ప్రవాహం నిమజ్జనానికి తగినట్లుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విగ్రహాల నిమజ్జనానికి తగినన్ని క్రేన్‌కు, డ్రైవర్లు, మెకానిక్ లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. క్రేన్‌లకు ఫిట్నెస్ ఉందా లేదా చెక్ చేసి సర్టిఫై చేయాలని ట్రాన్స్‌ఫోర్ట్ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ నిరంతం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఘాట్‌ల వద్ద గజ ఈతగాళ్ళు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఘాట్ల వద్ద అంబులెన్స్, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఎంహెచ్ఓని ఆదేశించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రాంతాల్లో జరిగే నిమజ్జనోత్సవానికి పోలీస్ శాఖ పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించేలా పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. వినాయక మండపాలలో సీసీటీవీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా రోడ్లపై వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, అడిషనల్ ఎస్‌పి హుసేన్ పీరా, జెడ్పీ సీఈవో నాసర రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, కర్నూలు ఆర్డీఓ సందీప్ నాయక్, పత్తికొండ ఆర్డిఓ భరత్ నాయక్, డీఎస్పీ బాబూ ప్రసాద్, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ ఉమాపతి, డిఎంఅండ్‌హెచ్ఓ శాంతి కళ, డిటిసి శాంత కుమారి ఇతర జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, జిల్లా గణేష్ ఉత్సవ సమితి కమిటీ అధ్యక్షులు వేణు గోపాల్, కార్యదర్శి గోరంట్ల రమణ, కర్నూలు నగర అధ్యక్షులు రంగస్వామి, కార్యదర్శి గిరిరాజు వర్మ, జిల్లా సమన్వయ కార్యదర్శి నాగఫణి శాస్త్రి, సహ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, పత్తికొండ నుంచి గోవర్ధన్ పాల్గొన్నారు.

ఎల్కేఆర్ గ్లోబల్ స్కూల్ నందు ఇంగ్లీష్ క్లబ్ ప్రారంభోత్సవ వేడుక

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: ఎల్కేఆర్ గ్లోబల్ స్కూల్ నందు ఇంగ్లీష్ క్లబ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ ప్రిన్సిపల్ శైలేంద్ర కుమార్ పాల్గొని మాట్లాడుతూ మన తెలుగు భాష ఎంత ముఖ్యమో ఆంగ్లభాష కూడా అంతే ముఖ్యమని, మన జీవితంలో ముందుకు వెళ్లడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ కోటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆంగ్ల భాష నేర్చుకోవడం వలన కలిగే ప్రయోజనాలు, వివిధ భాషలను నేర్చుకోవడం వలన నిజ జీవితంలో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో ఇంటర్వ్యూ, ఉద్యోగరీత్యా విదేశాలకు వెళ్లడానికి, చదువులో రాణించడానికి, కాంపిటీషన్లో పాల్గొనడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు ఇంగ్లీష్ క్లబ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బ్యాడ్జెస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్స్, ఏవో, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవనాసి వాగు దగ్గర సహాయక చర్యలు

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : మండల పరిధిలోని కొట్టాల చెరువుకు వరద ఉధృక్తి పెరగడంతో ఉదయం శివ భాష్యం ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ వరద నీరు చుట్టుపక్కల గ్రామాలైన కొట్టాల చెరువు, కురుకుంద, వడ్ల రామపురం, భారీగా వరద నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా ఆత్మకూరు పట్టణంలో భవనాసి వాగు వరద నీటితో పొంగిపొర్లుతుంది. ఆత్మకూరు నుంచి సుమారు 20 గ్రామాలకు వెళ్లే దారిలో భవనాసి వాగు వరద నీటితో నిండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆత్మకూరు తహసిల్దార్ రత్న రాధిక, ఎంపీడీవో ఉమర్, రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి, ఎస్సై వెంకటనారాయణ రెడ్డి దగ్గరుండి భవనాసి వాగు దగ్గర పరిస్థితిని పర్యవేక్షించారు.

గురురాజాలో అట్టహాసంగా శ్రీకృష్ణ జన్మాష్టమి ముందస్తు వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: ద్వాపర యుగానికి యుగ పురుషుడు శ్రీకృష్ణ పరమాత్ముని జన్మదినాన్ని పురస్కరించుకొని నంద్యాల పట్టణం ఎన్జీవో కాలనీ నందు గల శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రాంగణంలో ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు స్కూల్ డైరెక్టర్ పి.షేక్షావలి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కిండర్ గార్డెన్ చిన్నారుల బాలకృష్ణుని వేషధారణలు గోపికల ప్రదర్శనలు, వెన్నను ఆరగించే దృశ్యాలు, ఉట్టి కొట్టే సన్నివేశాలు, గోపికలతో బాలకృష్ణుని నృత్య ప్రదర్శనలు అబ్బురపరిచాయి. పురోహితుల సమక్షంలో శ్రీకృష్ణుని జన్మాష్టమి వేడుకలను సంప్రదాయ బద్ధంగా నిర్వహిం చారు. అనంతరం డైరెక్టర్ షావలి రెడ్డి మాట్లాడుతూ పిల్లలకు మన సంస్కృతి సంప్రదాయాలు, పెద్దలపట్ల గౌరవభావన ఏ విధంగా ఉండాలో తెలుసుకోవడానికి ఈ కార్యక్రమాలు ఎంతగానో దోహద పడతాయని విద్యార్థులకు తెలుపుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఎస్సై సరస్వతి అన్నారు. పట్టణంలోని అనంత జూనియర్, డిగ్రీ కళాశాలలలో బుధవారం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల తమ జీవితాలను చేజేతులా నాశనం చేసుకుంటారని విద్యార్థులకు తెలియజేశారు. మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మిద్దామన్నారు. అనంత విద్యాసంస్థల అధినేత అనంత రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవితం గడిపేందుకు అనుసరించాల్సిన విధానాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంత డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కొల్లం నరసింహ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శంకరాచారి, అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని మత్తు పదార్థాల నిర్మూలనకు ఎల్లవేళలా తాము కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

విద్యార్థులలో ప్రతిభను గుర్తించాలి

విశాలాంధ్ర- పాణ్యం: విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి కళాశాలకు మంచి గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేయడం జరుగుతుందని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎం సుబ్రహ్మణ్యం అన్నారు. శాంతిరాం ఇంజనీరింగ్ కాలేజ్ (ఆటోనమస్) లోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం, ఐఈఈఈ పవర్ ఎలక్ట్రానిక్ సొసైటీ ఆధ్వర్యంలో టెక్ స్పార్క్ -2౩25 ఇగ్నైట్ యువర్ ఇన్నోవేషన్ క్విజ్ పోటీని బుధవారం విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డా.ఎం.వి. సుబ్రమ హ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులు కొత్త ఆలోచనలతో, సాంకేతిక నైపు ణ్యాలతో ముందుకు సాగాలని ప్రేరణనిచ్చారు. ఈఈఈ విభాగాధిపతి, పిబిసి కోఆర్డినేటర్ డా.ఎం.యు.వీరేష్ విద్యార్థులను ప్రోత్సహించారు. ఫైనల్ రౌండ్‌లో ప్రతిభ కనబరిచిన జట్లను ప్రైజ్ మనీ, సర్టిఫికెట్లతో సత్కరించారు. అన్ని రౌండ్లలోనూ విద్యార్థుల ఉత్సాహం, పోటీ స్ఫూర్తి ఆకట్టుకుంది. కార్యక్రమం విజయవంతం కావడానికి విద్యార్థులు షేక్ వసీం, షేక్ లలూ బాష, సాయి సుధ, రఫీ, చక్రధర్, ఐఈఈఈ విద్యార్థి వలంటీర్స్ కీలక పాత్ర పోషించారు.

దేశ సార్వభౌమాధికారం కాపాడేది బీజేపీనే

విశాలాంధ్ర - పెద్దకడబూరు : దేశ సార్వభౌమాధి కారం కాపాడేది కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వమేనని రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీ నాయుడు, మంత్రాలయం నియోజకవర్గ బిజెపి ఇంచార్జీ విష్ణు వర్ధన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాథమిక పాఠశాల విద్యార్థులచే పురవీధుల గుండా జాతీయ జెండాను చేతబూని హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో జాతీయ జెండా కేవలం ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలలో ఎగుర వేసేవారని గుర్తు చేశారు. కానీ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురాలవేయాలన్నది మోదీ ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. మొన్న జరిగిన యుద్ధంలో నాలుగు రోజులకే పాకిస్తాన్ తోక ముడుచుకుందని మట్టి కరిచిందని తెలిపారు. దీంతో భారతదేశ సత్తా ఏంటో ప్రపంచానికే తెలిసిందని గుర్తు చేశారు. కావున ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండా ఎగుర వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి కో కన్వీనర్ చిరుత పల్లి చిన్న ఈరన్న, జిల్లా కిసాన్ మోర్చ కన్వీనర్ బంగారయ్య, జిల్లా కార్యదర్శి చిన్న నరసయ్య, బిజెపి మండల అధ్యక్షులు పురుషోత్తం గౌడ్, జయకృష్ణ, నాయకులు నరసప్ప, వీరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా బుచ్చి రాంప్రసాద్

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునరుద్ధరించి బ్రాహ్మణ సాధికార సమితి కన్వీ నర్ బుచ్చి రాం ప్రసాద్‌ను కార్పొ రేషన్ చైర్మన్‌గా నియమించడం పట్ల బ్రాహ్మణ చైతన్య వేదిక నంద్యాల జిల్లా అధ్యక్షులు కె.పి.వి.సుబ్బారావు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ చైర్మన్ నియామకం చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. 2015-19 మధ్య కాలంలో కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణులకు జరిగిన మేలు బ్రాహ్మణ కుటుంబాలు మరువలేదని అంతే ఆశతో కార్పొరేషన్ పునరుద్ధరణ కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. కార్పొరేషన్ చైర్మన్ నియామకం జరగటంతో బాడీ ఏర్పాటుకు త్వరిత గతిన పూర్తిచేసి, బ్రాహ్మణులకు మేలు జరిగేలాగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆర్టీఈ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - కర్నూల్ ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని ఆర్టీఈ విద్యార్థుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని రాయలసీమ విద్యార్థి సంఘాల జెఎసి చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు, బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పగడాల ఆనంద్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని బిర్లా కాంపౌండ్ సాయి వసంత్ కాంప్లెక్స్‌లో జెఎసి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. విద్యా హక్కు చట్టం-2009 అమలుకు రాష్ట్రవ్యాప్తంగా పోరుబాట కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాల ఫీజు బకాయిలు చెల్లించడంతో పాటు, ప్రభుత్వం విద్యాసంస్థలకు ఇస్తున్న ఫీజును రూ.30 వేలకి పెంచాలని, ఆర్టీఈ విద్యార్థులకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని, మార్కులు హాజరు పర్యవేక్షణను మండల విద్యా శాఖ అధికారులు చేపట్టాలని, ఫేజ్-1లో సీట్లు పొంది రిజెక్ట్ అయిన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేసిన ఫీజులు తిరిగి ఇవ్వాలని పాఠశాల మేనేజ్మెంట్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఈ పేరెంట్స్ సమితి నాయకులు ఖాదర్ ఖాన్, అశోక్, నగేష్, విశ్వనాథ్ యాదవ్, ఉసేన్ ఫీరా, రవి, మహేంద్ర, షకీల్, విద్యార్థి సంఘాల నాయకులు గణేష్, జయకృష్ణ, ఆనంద్, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర - నంద వరం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు రైతులకు అవసరమై నంత యూరియాను సరఫరా చేయడంలో అధికారులు, కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, సిపిఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, రైతు సంఘం తాలూకా కార్యదర్శి శాంతన్న విమర్శించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మండల వారీగా సొసైటీలోను, ఆర్బికేలోను రైతులు గుంపులు గుంపులుగా, పడిగాపులుగా ఉండి ఇబ్బందులు పడుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం యూరియా కృత్రిమ కొరతను నివారించి, రైతులను ఆదుకోవాలని, రైతులందరికీ ప్రభుత్వం నిర్ణయిం చిన ధరలకే యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వారి గోడౌన్‌లో నుండి యూరియాను అమ్ముకోవడం జరుగుతుందని, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, ఫర్టిలైజర్ షాపులను పర్యవేక్షించడం లేదని, యూరియాను బ్లాక్ మార్కెట్ చేస్తున్న వ్యాపారు లను అరికట్టి వారి పైన క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

ఒంటిమిట్టలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాం

విశాలాంధ్ర - హొళగుంద: పులివెందల, ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నికలను కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించిందని మండల టిడిపి కన్వీనర్ వీరన్న గౌడ అన్నారు. స్థానిక సిద్దేశ్వర రైస్ మిల్ ఆవరణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఒంటిమిట్ట, పులివెందుల జడ్పిటిసి ఎన్నికల్లో ప్రజాస్వామ్యం అయిందంటూ ఆరోపించడం సిగ్గుచేటుగా అభివర్ణించారు. టిడిపి పార్టీ ఎంతో క్రమశిక్షణ గల పార్టీ అని వైసిపి పాలనలో దౌర్జన్యం పరాకాష్టకు చేరిందని విమర్శించారు. వైసిపి పాలనలో అధికార దుర్వినియోగం జరిగిందని పోలీస్, రెవెన్యూ శాఖను వైసీపీ ప్రభుత్వం చెప్పు చేతుల్లో పెట్టుకొని ఎన్నికల్లో టిడిపి తో పాటు ఏ రాజకీయ పార్టీలు నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారని, అప్రజాస్వామ్యం జరిగిందని వాపోయారు. గత ఎన్నికల్లో టిడిపి, స్వతంత్ర అభ్యర్థులను నామినేషన్ వేయకుండా దౌర్జన్యం చేసి భయభ్రాంతులకు గురిచేసింది ఎవరో ప్రజలకు తెలుసని అన్నారు. వైసీపీ నాయకులు ప్రజాస్వామ్యపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉన్నదని అ ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచిన మీరు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడం సిగ్గుచేటుగా ఉన్నదని అన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో 11 మంది అభ్యర్థులు నామినేషన్ వేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని గత 30 ఏళ్లలో పులివెందులలో ఇతర పార్టీలు నామినేషన్ వేయలేదని ప్రజలను ఓటు వేయకుండా అడ్డుకున్న ఘనత వైసీపీ నాయకులకు దక్కుతుందన్నారు. గత ఎన్నికల్లో వైసిపి పార్టీకి ప్రజలు ఘోరంగా ఓడించి 11 సీట్లు ఇచ్చిన ఇంకా బుద్ధి రాలేదని ఎద్దేవా చేశారు వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామని భయంతో వైసిపి నాయకులు నానా మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. వచ్చేఎన్నికల్లో వై నాట్ పులివెందల అవుతుందని పులివెందల సీటును వైసీపీ ఘోరంగా ఓడిపోతుందని అన్నారు. సమావేశంలో మండల జనసేన పార్టీ కన్వీనర్ అశోక్, మాజీ మండల బిజెపి కన్వీనర్ ప్రసాద్, టిడిపి నాయకులు పంపాపతి, ఎర్రి స్వామి, అబ్దుల్ సుభాన్, మోయిన్, బసవ, జంగాల లక్ష్మన్న, హుస్సేన్ పీరా, దిడ్డి తిక్క స్వామి, బిజెపి నాయకుడు ఉల్లిగన్న పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: ప్రపంచ అవయవ దాన దినోత్సవం పురస్కరించుకుని నంద్యాల లయన్స్ క్లబ్ స్థానిక శ్రీ గురు రాఘేంద్ర బ్యాంకు కోచింగ్ కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. దస్తగిరిరెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ జి.రవికృష్ణ, సీనియర్ వైద్యులు డాక్టర్ గెలివి సహదేవుడు పాల్గొని విద్యార్థులకు అవయవ దాన ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అవయవ దానంపై ప్రజా అవగాహన కరపత్రాన్ని డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి విడుదల చేశారు. క్లబ్ కోశాధికారి జనార్ధన్ సౌజన్యంతో అవయవదానంపై ప్రసంగించిన పదిమంది విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. వైద్యులు డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ సహదేవుడు ప్రసంగిస్తూ మనిషి సాధారణంగా మరణించిన తర్వాత ఆరు గంటల లోపు రెండు నేత్రాలను దానం చేయవచ్చని, బ్రతికి ఉన్న సమయంలో తమకున్న రెండు మూత్రపిండాలలో ఒక దానిని, అదేవిధంగా కొంత భాగం కాలేయాన్ని, కొంత భాగం చర్మాన్ని దానం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. వివిధ కారణాల రీత్యా ప్రమాదాలలో బ్రెయిన్ డెత్ (జీవన్ మృతుడు)అన్న స్థితికి చేరుకున్న మనుషుల నుండి బంధువుల అనుమతితో గుండె, మూత్ర పిండాలు ఊపిరితిత్తులు, ప్యాంక్రియాస్, కాలేయం, రెండు నేత్రాలు అవసరమున్న వారికి అమర్చి పునర్జన్మను ప్రసాదించే అవకాశం ఉంటుంద న్నారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి తాతిరెడ్డి భాస్కర్ రెడ్డి, కోశాధికారి అమిదేల జనార్ధన్, అధిక సంఖ్యలో బ్యాంక్ కోచింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవులు ఇచ్చిన సీఎంకు ధన్యవాదాలు

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఉమ్మడి కర్నూలు జిల్లాలో పార్టీలో పని చేస్తున్న వారికి నామినేటెడ్ పదవులలో ప్రాధాన్యతనివ్వడం పట్ల జిల్లా టిడిపి అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి ధన్యవాదములు తెలిపారు. ఎస్సీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్‌గా అకెపోగు ప్రభాకర్, బొందిలి అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా విక్రమ్ సింగ్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ అనివృద్ధి సంస్థ చైర్మన్‌గా కె.పార్వతమ్మకు అవకాశం కల్పించడం సంతోష దాయకంగా ఉందని, రానున్న రోజులలో మరిన్ని పదవులు జిల్లాకు దక్కే అవకాశ ముందని, ఎవ్వరూ నిరాశ చెందవద్దని సూచించారు. అనంతరం టిడిపి అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు నామినేటెడ్ పదవులు పొందిన ఎస్సీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ అకెపోగు ప్రభాకర్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ అనివృద్ధి సంస్థ చైర్మన్ కె. పార్వతమ్మను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్లు కె.నాగేంద్రకుమార్, డి.జేమ్స్, విజయకుమార్, పార్టీ నాయకులు ఎల్లప్ప, సత్రం రామక్రిష్ణ, హనుమంత రావు చౌదరి, ఎల్.వి.ప్రసాద్, పుల్లయ్యచౌదరి, పెరపోగు రాజు, నాగరాజా రావు చౌదరి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం



విశాలాంధ్ర - ఓర్వకల్లు : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిది అని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. ఈ మేరకు నన్నూరు గ్రామానికి చెందిన పర్ల రామలక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెకు సీఎం రిలీఫ్ ఫండ్ 45,000 రూ.మంజూరు చెక్కు పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నేడు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అంది జేశారు. ఈ సందర్భంగా బాధిత పర్ల రామలక్ష్మమ్మ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ విధులను మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి యువనేత లోకేష్ బాబుకి ధన్యవాదాలు తెలిపారు. కర్నూలు మార్కెట్ యార్డు డైరెక్టర్ తలారి విజేయుడు, పార్టీ నాయకులు విశ్వేశ్వర రెడ్డి, ఖాజామియ్య, కానాల రాంభూపాల్ రెడ్డి షంషుద్దీన్ శ్రీపతి బుజ్జప్ప, పర్ల మధు గోపాల్, ఇర్ఫాన్ అలిఖాన్ పాల్గొన్నారు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి సూచనలు మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్, బ్యాంక్, పంచాయతీ, సచివాలయం, భూసేకరణ ఇతర సంబం ధిత అధికారులతో వచ్చే నెల సెప్టెంబర్ 13 జరుగ బోయే జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో కోర్టులలో పెండింగ్ ఉన్న సివిల్ కేసులు, భూసేకరణ కేసులు త్వరితగతిన పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌ను సెప్టెంబర్ 13వ తేదిన నిర్వహించడం జరుగుతుందన్నారు. అందులో ఎక్కువ కేసులు పరిష్కరించేల ప్రత్యేక దృష్టి సారించి, ఈలోక్ అదాలత్‌ను విజయవంతం అయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ అవకాశమును కక్షిదారులు వినియోగించుకోని వారి కేసులను రాజీ పూర్వకంగా పరిష్కరించు కోవాలని కోరారు.

కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్రరెడ్డి, టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి అన్నారు. బుధవారం పెద్దకడబూరు గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు ఈరన్న ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్, అన్నదాత సుఖీభవ విజయోత్సవ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ట్రాక్టర్లతో భారీ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ డబ్బులు జమ కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రైతుల కళ్ళల్లో ఆనందం చూడడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని తెలిపారు. ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుందన్నారు. మండలంలో ఓ చోటా నాయకుడు తన తండ్రి తల వెంట్రుక నెరిసినప్పుడు కూడా పుట్టిని వాడు నేడు తన తండ్రి గురించి మాట్లాడే అర్హత లేదని విమర్శించారు. మాట్లాడితే కార్యకర్తలు ఇంటికి వెళ్లి బుద్ధి చెపుతారని హెచ్చరించారు. నీలాగ తిరుపతి టికెట్లు అమ్మి బతుకలేదు మా నాన్న, ఈ రోజు నీవు నాయకుడు అయ్యాయని వైసీపీ చోటా నాయకుడిపై మండిపడ్డారు. గ్రామాలలో రెండు గ్రూపులు తయారు చేసి ఇరువైపులా సర్పంచులకు పోటీలో నిలబెట్టి డబ్బులు తీసుకుని వసూలు చేసుకున్న నీవు ఇలా మాట్లాడడం సిగ్గు లేదా అని ఘాటుగా విమర్శించారు. ఇప్పటికైనా తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు ఏసేపు, టీబీ చైర్మన్ టిప్పు సుల్తాన్, యువ నాయకులు రాకేష్ రెడ్డి, సొసైటీ చైర్మన్లు మీ సేవ ఆంజనేయులు, కందనాతి నరసప్ప, నాయకులు అడివప్ప, వెంకటపతి రాజు, పల్లెపాడు రామిరెడ్డి, వీరేష్ గౌడ్, గోనుమాన్ నరసన్న, కలుగొట్ల లక్ష్మన్న, బొగ్గుల తిక్కన్న, బొగ్గుల నరసన్న, తలారి అంజి, మునెప్ప, సొంటెన్న, సత్యన్న గౌడ్, ఏక హనుమంతు, నర్సింహులు, చంద్ర, మొట్రు రామాంజనేయులు, నాలుగు మండలాల నుంచి వచ్చిన కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షాలు వస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: జిల్లాలో అధికంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తం కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం సబ్ కలెక్టర్ ఆర్డీవోలు తహశీల్దార్లు, ఎంపిడిఓలు, ఇరిగేషన్ అధికారులతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత రెండు మూడు రోజులుగా అధిక వర్షపాతం నమోదయిందన్నారు. జూన్ జూలైలో సాధారణ వర్షపాతం నమోదు కాగా, ఆగస్టులో ఇప్పటివరకు 146.5 మి.మీ.తో 27.8శాతం అధిక వర్షపాతం నమోదయిందన్నారు. కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్, కల్లూరు, చిప్పగిరి, హొళహర్వి, ఆలూరు, మద్దికెర, నందవరం మండలాలలో అధిక వర్షపాతం నమోదయిందన్నారు. వచ్చే రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్లు, చెరువులు, లోతట్టు ప్రాంతాలు, పాత బ్రిడ్జిలు పరిశీలించాలని కలెక్టర్ సబ్ కలెక్టర్, తహసీల్దార్లు, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.